ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 124 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 13 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


### కోల్‌కతా హత్యాచార ఘటనపై
## దేశవ్యాప్త ఆందోళన



ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు

నిందితుడిలో ఏ కోశాన కానరాని పశ్చాత్తాపం

ఉరితీసుకున్నా ఫర్వాలేదంటూ తలబిరుసు సమాధానం

2లో..



### హిండెన్ బర్గ్ నివేదికపై
## జెపిసి విచారణ

**విపక్ష నేత రాహుల్ డిమాండ్**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): సెబీ చీఫ్ మాధబి పురి బచ్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారంటూ హిండెన్ బర్గ్ విడుదల చేసిన నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. చిన్న రిటైల్ వ్యాపారుల సంపదకు భద్రత కల్పించే బాధ్యతను అప్పగించిన సెక్యూరిటీస్ రెగ్యులేటర్ అయిన సెబీ సమగ్రత ఆ సంస్థ చైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో తీవ్రంగా రాజీపడిరదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆమె వాటాలు కొనుగోలు ..మిగతా 2లో

### తెలంగాణలో హ్యుందాయ్
# మెగా టెస్టింగ్ సెంటర్

## కొరియాలో సిఎం రేవంత్ బృందం పర్యటన

**ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ సంస్థతో చర్చలు**



సియోల్, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మోటార్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంట్లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సహా అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సదుపాయం ఉండేలా ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరించాలని హ్యుందాయ్ తెలిపింది. భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హ్యుందాయ్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డి బృందానికి తెలిపారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్‌ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ ..మిగతా 2లో



### పంద్రాగస్ట్ వేడుకలకు
## గోల్కొండ కోట ముస్తాబు

**ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ శాంతికుమారి**

**15న తొలిసారి జెండా ఎగురేయనున్న సిఎం రేవంత్**

హైదరాబాద్, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభిస్తారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి 2023 స్వాతంత్ర్య వేడుకల వరకు మాజీ సీఎం కేసీఆరే గోల్కొండపై జెండా ఎగురవేసేవారు. కాగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలిసారి జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి సోమవారం పరిశీలించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే.. వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ..మిగతా 2లో

## 16న నగరానికి ఉపరాష్ట్రపతి రాక

**ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష**



హైదరాబాద్, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): ఈ నెల 16వ తేదీన భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాష్ట్ర పర్యటనకు వస్తున్నందున తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటనకు సంబంధించి అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. 17వ తేదీన ..మిగతా 2లో

### వయనాడ్‌లో కొనసాగుతున్న
## సహాయక చర్యలు



**ఇంకా ఆచూకీ లేని 130 మంది జాడ**

వయనాడ్, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): కనీవినీ ఎరుగని విలయాన్ని చూసిన వయనాడ్‌లో ఇంకా విషాదకర పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే 200లకు పైగా మృతదేహాలను గుర్తించగా.. అనేక మంది ..మిగతా 2లో



## రాహుల్ ప్రమాదకర వ్యక్తి

**సినీ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): 'రాహుల్ గాంధీ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అంటూ..సినీ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. అతడు ప్రధాని కాలేదనే నిరాశలో దేశ ఆర్థిక పరిస్థితిని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదికను ఆధారంగా చేసుకొని, స్టాక్ మార్కెట్ గురించి అసంతృప్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలు ఆయనను ఎప్పటికీ గెలిపించరు. రాహుల్ ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉ ండిపోతారు' అంటూ కంగన ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. భారతీయ స్టాక్ మార్కెట్ క్రాష్ అవ్వాలని, ఎకానమిని ధ్వంసం చేయాలని కాంగ్రెస్ కోరుకుంటుందని దుయ్యబట్టారు. కాగా హిండెన్‌బర్గ్ నివేదికపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'సెబీ' పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. 'ఛైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో సెబీ పవిత్రత మసకబారింది. దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు వేస్తున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు? ఒకవేళ ఇన్వెస్టర్లు తాము కష్టపడి సంపాదించిన ..మిగతా 2లో

## సుప్రీంలో కవితకు దక్కని ఊరట

**మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ**

**ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ**

**విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన దర్మాసనం**



న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యతంర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు ..మిగతా 2లో

## జూరాల గేట్లు మూసివేత



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12(ప్రభాత ఉదయం) కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వరద ఉద్ధృతి క్రమంగా తగ్గడంతో సోమవారం జూరాల వరద నియంత్రణ అధికారులు ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. జూరాల ప్రాజెక్టుకు 20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయింది. వరద ప్రవాహం తగ్గడంతో జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318. 516 మీటర్లు కాగా, ప్రస్తుత 317.840 మీటర్లుగా ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.300 టీఎంసీల నీరు ఉంది. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 630 క్యూసెక్కులు, జూరాల కుడి కాలువకు 717 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



### కెసిఆర్ సంకల్పంతోనే
## సీతారామ పూర్తి

**కాంగ్రెస్ 7 నెలల్లోనే ప్రాజెక్ట్ పూర్తి చేసినట్లు బిల్డప్**

**మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు**

హైదరాబాద్,ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు కోసం సంకల్పం చేసింది కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా దాన్ని నిర్మించాలను కున్నారని చెప్పారు. '8 నెలల్లో సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా? కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా ప్రవర్తిస్తున్నారు. వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీపడి పర్యటనలు చేస్తున్నారు. మేము ఇచ్చిన ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకొంటు న్నారు. మేము చేసిన ప్రతి మంచి పని కాంగ్రెస్ ప్రభుత్వం ..మిగతా 2లో

## తెలంగాణలో హ్యుందాయ్

# మెగా టెస్టింగ్ సెంటర్

మొదటి పేజీ తరువాయి...

సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ఎంఐఈ వంటి అత్యుత్తమ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి బృందం ప్రస్తుతం కొరియాకు చేరుకొని అక్కడ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. కొరియా పర్యటనలో భాగంగా బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని కోరారు. టెక్స్‌టైల్ రంగం విస్తృతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు అనుకూలంగా ఉందని సీఎం తెలిపారు. యంగాన్ కార్పొరేషన్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. సీఎం పిలుపునకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. అంతకముందు కొరియాలోని అతిపెద్ద పారిశ్రామిక వ్యవస్థల్లో ఒకటైన ఎల్.ఎస్.గ్రూపు ఛైర్మన్‌తో సీఎం రేవంత్



సమావేశమయ్యారు. ప్రఖ్యాత ఎల్‌జీ గ్రూపు వ్యవస్థాపకులైన ఎల్.ఎస్. గ్రూపు కుటుంబాన్ని కలవడంతోనే కొరియా పర్యటన ప్రారంభం కావడంపై సీఎం హర్షం తెలిపారు. ఎలక్ట్రిక్ కేబుల్స్, బ్యాటరీల తయారీ, గ్యాస్, ఎనర్జీ తదితర రంగాల్లో పెట్టుబడుల విస్తరణకు ఎల్ఎస్ గ్రూపు ఆసక్తి కనబరుస్తోంది.

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణ కొరియాలోని సియోల్ చేరుకున్న ఆయన.. వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.. ఇందులో భాగంగా ఆయన ఎల్ఎస్ (ఎల్‌జీ) గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై చర్చించారు. త్వరలో తెలంగాణలో పర్యటించేందుకు ఎల్ఎస్ గ్రూప్ బృందం అంగీకరించింది. మరోవైపు కొరియా టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్యతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కొరియా పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎనిమిది రోజుల పాటు అమెరికాలో సీఎం జరిపిన పర్యటన విజయవంతమైందని తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశాల ఫలితంగా.. 19 కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు 50కి పైగా వాణిజ్య సంస్థలతో సమావేశమైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే దిశగా పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపింది.



## పంద్రాగస్ట్ వేడుకలకు

# గోల్కొండ కోట ముస్తాబు

మొదటి పేజీ తరువాయి...

ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. కాగా.. ఈ స్వాతంత్య్ర వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఓ వైపు సీఎస్ ఆదేశాలతో అధికారులు పరుగులు పెడుతుంటే.. అదే స్థాయిలో గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండలో స్వాతంత్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జెండా వందనం చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు రానున్న నేపథ్యంలో అనేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ముందు నిర్వహించే పరేడ్‌కి సంబంధించి రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, ఈ పరేడ్ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.



# రాహుల్ ప్రమాదకర వ్యక్తి

మొదటి పేజీ తరువాయి...

డబ్బును కోల్పోతే.. ఎవరు జవాబుదారీగా ఉంటారు? ప్రధాని మోదీనా? సెబీ ఛైర్‌పర్సనా? లేదా అదానీనా? ఈ అంశాన్ని సుప్రీంకోర్టు మరోసారి సుమోటోగా పరిశీలిస్తుందా?‘ అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. దీనివల్ల భారతీయ స్టాక్ మార్కెట్‌లో గణనీయమైన ప్రమాదం పొంచి ఉందనే విషయం ప్రజల దృష్టికి తీసుకురావడం లోక్‌సభా ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.

# హిండెన్ బర్గ్ నివేదికపై జెపిసి విచారణ

మొదటి పేజీ తరువాయి...

చేసినట్లు వెల్లడైందని, కానీ ఇప్పటికీ ఆమె రాజీనామా చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ఆరోపణలు వెలుగుచూడటంతో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరిస్తోందా? అని ప్రశ్నించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్ బర్గ్ నివేదికతో లక్షలాది మంది భారతీయుల పొదుపులు ప్రమాదంలో ఉన్నాయని.. ఈ అంశంపై విచారణ చేపట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు వాస్తవమై? వ్యాపారులు కష్టపడి దాచుకున్న సంపద పోగొట్టుకుంటే ప్రధాన మంత్రా లేదా సెబీ చీఫ్ లేదా అదానీ ఎవరు బాధ్యత వహిస్తారు? అని ప్రశ్నించారు. ఈ అంశంలో జెపిసి విచారణకు ప్రధాని ఎందుకు వెనకడుగు వేస్తున్నారో స్పష్టమౌతోందని అన్నారు. స్టాక్ మార్కెట్‌లో చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారు లకు భద్రత కల్పించాలంటే జెపిసి విచారణ తప్పనిసరి అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. భారత రాజ్యాంగ విలువలను పక్కన పెట్టి తన మిత్రులను కాపాడుకునేందుకు ప్రధాని యత్నిస్తుంటారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. తమ మిత్రులైన కార్పొరేట్ల అవినీతి విధానాలను రక్షించేందుకు, కేవలం కార్పోరేట్ ప్రయోజనాలను కాపాడేందుకు మాత్రమే బిజెపి పనిచేస్తోందని సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. జెపిసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జెపిసి విచారణ చేపట్టాల్సిందేనని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.



## వయనాడ్‌లో కొనసాగుతున్న

# సహాయక చర్యలు

మొదటి పేజీ తరువాయి...

జాడ ఇంకా లభించలేదు. దీంతో రెండు వారాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. సుమారు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు పేర్కొన్నారు. వీరి కోసం చలియార్ నది, పరిసర అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టినట్లు వెల్లడిరచారు. వయనాడ్‌లో జుల్కై 30న కొండచరియలు విరిగిపడిన ఘటనలో 229 మంది చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో 51 మందిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపింది. వీరికి సంబంధించిన డీఎన్ఏ నివేదిక ఆగస్టు 13లోగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాదాపు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని ప్రభుత్వం వెల్లడిరచింది. వీరికోసం గడిచిన రెండు వారాలుగా ముమ్మర గాలింపు కొనసాగుతోంది. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖలకు చెందిన 190 మంది సభ్యుల బృందం.. వరదలు చోటుచేసుకున్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. ఇందులో భాగంగా చలియార్ నది, దాని పరివాహక ప్రాంతాలు, సవిరీప అడవులపై దృష్టిసారించినట్లు ఏడీజీపీ ఎం ఆర్ అజిత్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒకసారి గాలించామని, తాజాగా నది, దాని తీర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ఎగువ ప్రాంతం మొత్తం పూర్తికాగా, ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. అయితే, నీటి స్థాయిలు తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. భారీ వర్షం కారణంగా సెర్చ్ ఆపరేషన్‌కు అంతరాయం కలుగుతోందన్నాయి. అయితే, సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక విరీడియా వెల్లడిరచింది.

# 16న నగరానికి ఉపరాష్ట్రపతి రాక

మొదటి పేజీ తరువాయి...

ఉదయం ఢిల్లీకి తిరుగు ప్రయాణం వరకు సంబంధిత విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ ఆదేశించారు. పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ యం.డిని ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, పంచాయత్ రాజ్ శాఖ అధికారులు, ఖీఉఎ ంతిసూనీసబి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీంలో కవితకు దక్కని ఊరట

మొదటి పేజీ తరువాయి...

వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ల ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచూ?డాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది. ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుపు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థల తీరును ఆమె తరుపు న్యాయవాది తప్పుబట్టారు. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని.. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని.. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

## కెసిఆర్ సంకల్పంతోనే

# సీతారామ పూర్తి

మొదటి పేజీ తరువాయి...

చేసిందని చెప్పుకొంటున్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరేవారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఉండేదా? కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కానీ, కేసీఆర్ ఈ జిల్లాలో రెండు పంటలు పండే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు. 8 ప్యాకేజీల్లో 5 భారాస ప్రభుత్వం చేసిందే. మరో 3 ప్యాకేజీల్లో 80 శాతం పనులు మేమే పూర్తి చేశాం‘ అని హరీశ్‌రావు తెలిపారు.



# స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12(ప్రభాత ఉదయం) స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో వేడుకలు నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమం, తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, ఆర్డీఓ రాంచందర్, అడిషనల్ ఎస్పీ గుణశేఖర్, ఏఓ వీరభద్రప్ప, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కోల్‌కతా హత్యాచార ఘటనపై దేశవ్యాప్త ఆందోళన

కోల్‌కతా, ఆగస్ట్ 12 (ప్రభాత ఉదయం): కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కుదిపేస్తోంది. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ కేసులో సంచలన విషయాలను పోలీసులు వెల్లడిరచారు. ఈ కేసులో నిందితుడి గురించి పోలీసులు వివరాలు తెలిపారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో నిందితుడు వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన అనంతరం తాను ఉండే ప్రాంతానికి తిరిగొచ్చి హాయిగా నిద్రపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఉదయం సాక్ష్యాలను చెరిపివేయడానికి తన దుస్తులపై ఉన్న రక్తపు మరకలను తుడిచి పెట్టేందుకు ఉతుక్కున్నాడని చెప్పారు. అయితే.. అతడి బూట్లపై ఉన్న రక్తపు మరకల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. పౌర వాలంటీర్ అయిన నిందితుడికి ఈ ఆస్పత్రితో ఎలాంటి సంబంధం లేదని.. అప్పుడప్పుడు ఇక్కడికి వస్తాడని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం సిటీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ మెడికల్ కళాశాలను రెండో రోజు పరిశీలించారు. నిరసనకు దిగిన వైద్యులతో సమావేశమయ్యారు. విచారణ పారదర్శకంగా జరుగుతోందని.. ఈ కేసులో ఎలాంటి వదంతులను వ్యాపింపజేయవద్దని కోరారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా..? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఇప్పటి వరకూ అలాంటి ఆధారాలు లభించలేదని.. బాధితురాలి తుది పోస్టుమార్టమ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమ దర్యాప్తులో లభించిన



ఆధారాలతో నివేదికను పోల్చి చూడాల్సి ఉంటుందని వెల్లడిరచారు. ప్రాథమిక పోస్ట్‌మార్టమ్ నివేదిక ప్రకారం.. బాధితురాలి కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర భాగాల్లో కూడా గాయాలు ఉన్నట్లు తేలింది. అయితే.. వైద్యురాలిని మొదట హత్య చేసి.. ఆ తర్వాత నిందితుడు అత్యాచారానికి పాల్పడి ఉంటాడని మరో పోలీసు అధికారి వెల్లడిరచారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ పనిచేసిన సిబ్బందిని విచారించినట్లు.. సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టినట్లు వివరించారు. నిరసనకు దిగిన జూనియర్ డాక్టర్లతో చర్చలు చేపట్టామని.. వారి డిమాండ్ మేరకు ఓ పోలీస్ అధికారిపై చర్యలు తీసుకున్నట్లు పోలీసు కమిషనర్ వెల్లడిరచారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విషయాలను దాచడం లేదని తెలిపారు. మరోవైపు జూనియర్ వైద్యులు తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకూ నిరసనను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. నిందితుడు సంజయ్ రాయ్ దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరి తీయాలనుకుంటే తీసుకోవాలంటూ.. ఎదురుచెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. అతడి ఫోన్ నిండా అశ్లీల వీడియోలు ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు సమాచారం. ఈ ఘటన చోటుచేసుకునే ముందు మృతురాలి గురించి పలు విషయాలను తోటి సిబ్బంది తెలిపారు. గురువారం రాత్రి విధుల్లోకి వచ్చిన ఆమె.. ఒలింపిక్స్ పోటీలను వీక్షించినట్లు చెప్పారు. ఈ ఘటన చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందు నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ÷న్కెల్‌ను ఆమె వీక్షించినట్లు తెలిపారు. తన తోటి సిబ్బందితో కలిసి డిన్నర్ చేసి.. ఆ తర్వాత తల్లికి ఫోన్ చేసి మాట్లాడినట్లు వివరించారు. ఆ తర్వాత ఆమె సెమినార్ హాల్‌లో చదువుకునేందుకు వెళ్లిపోయిందని పేర్కొన్నారు. మరోవైపు ఈ కేసు రాజకీయ రంగు పులుము కోవడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఆదివారం లోగా కోల్‌కతా పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే.. దీన్ని సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష భాజపా నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# పాఠశాలలును తనిఖీ చేసిన ఎం ఈ ఓ శంకర్ రాథోడ్



పాఠశాలల్లో విద్యార్థుల ను చదువు గురించి ప్రశ్నిస్తున్న ఎం ఈ ఓ శంకర్ రాథోడ్..



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎం ఈ ఓ శంకర్ రాథోడ్

బుద్వేల్, ఆగస్టు12(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లోని ఐదు పాఠశాలను మండల విద్యాధికారి కె. శంకర్ రాథోడ్ సోమవారం తనిఖీ చేశారు. నేతాజీ నగర్ , శ్రీరామ్ నగర్ కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలి పురం , గణేష్ నగర్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబడుతుందని, నేర్చుకున్న అంశాలను తూచా తప్పకుండా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేయవలసిందిగా ఈ సమావేశమందు తెలియ చేశారు.



# పత్తి కుంటను అభివృద్ధి చేయండి

## జోనల్ కమిషనర్ వెంకన్నను కలసి విజ్ఞప్తి చేసిన శ్రీధర్


బుద్వేల్, ఆగస్టు12(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ పత్తికుంటను వినాయక నిమజ్జనాల కోసం అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం గ్రేటర్ దక్షిణ మండల జోనల్ కమిషనర్ వెంకన్నను రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, కార్యదర్శి జోగి రవి లు కలసి వినతిపత్రం అందజేశారు . దుంకుడు బండల పై నుండి వచ్చే స్వచ్ఛ మైన వర్షం నీరు పత్తి కుంట కు వచ్చే దారి లో చాలా చెత్త చెదారం ఉందని దానిని తొలగిస్తే తప్ప నీరు చెరువు లోకి రాదన్నారు. చుట్టు ప్రక్కల చాలా మంది డంపింగ్ మట్టి తెచ్చి పోస్తున్నారని ఆ మట్టిని తీసివేయాలన్నారు. పత్తి కుంట లోని నీరు బైటకు పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి కుంట పరిసరాలలో లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్డు పక్కన లారీలు బస్సులు వచ్చి అక్కడే శుభ్రం చేయటం జరుగుతుందని అవి ఆపకుండా చూడాలన్నారు. సెప్టెంబరు 7 వ తేదీన వినాయక చవితి వరకు పత్తి కుంట లో పనులు పూర్తి కావాలన్నారు. జోనల్ కమీషనర్ తో పాటు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ కె. రవి కుమార్ కూడా జోనల్ కమిషనర్ వద్ద ఉన్నారు . జోనల్ కమిషనర్ వెంకన్న స్పందించి వెంటనే అంచనాలు తీసుకుని రావలసిందిగా ఈ ఈ నరేందర్ గౌడ్ కు ఆదేశాలు జారీ చేశారు.



అంగన్వాడి కేంద్రానికి వాటర్ బబుల్స్ అందజేస్తున్న దాతలు

# అంగన్వాడి కేంద్రానికి దాతల సహకారం

రాజేంద్ర నగర్,ఆగస్టు12(ప్రభాత ఉదయం) అంగన్వాడి కేంద్రానికి దాతల సహకారం అభినందనీయమని స్థానిక నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ అంగన్వాడి కేంద్రంలో సోమవారం సిద్ధిరాల సంతోష్ సహకారంతో ఐదు అంగన్వాడి కేంద్రాలకు వాటర్ బబుల్స్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి అంగన్వాడి కేంద్రానికి అవసరమైన వాటిని సమకూర్చడం అభినందనీయం అన్నారు. ఆయనకు ప్రత్యేకంగా అభినందించారు. అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ నవ యువ యూత్ క్లబ్ అంగన్వాడీ కేంద్రంలకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మౌనిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ అభివృద్ధి తోడుపాడుతున్నారన్నారు. వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి , అంగన్వాడీ టీచర్లు కనకవ్వ, అనిత, మాధవి, సుజాత, స్వప్న, సంగీత లు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఎం ఈ ఓ కె. శంకర్ రాథోడ్ ను కలసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలువుతున్న రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు

# ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ 'శాశ్వత విద్యా సంఖ్య' ఇవ్వాలి

## ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలకు ఎంఈఓ శంకర్ రాథోడ్ సూచన

బుద్వేల్, ఆగస్టు 12 (ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ జారీ చేసే ఆదేశాలను ప్రతి పాఠశాల పాటించాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె. శంకర్ రాథోడ్ సూచించారు. విద్యార్థినీ, విద్యార్థుల బోనఫైడ్ జారీ చేసే సమయంలో తప్పని సరి పిన్ నంబర్ పొందుపరుచాలని ఆయన చెప్పారు. మండల విద్యా శాఖ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. శంకర్ రాథోడ్ ను సోమవారం రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధుల బృంధం మర్యాధపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా యాజమన్య సంఘాల ప్రతినిధులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశామయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పిన్ నంబర్( శాశ్వత విద్యా సంఖ్య) ఆన్ లైన్ లో నమోదు చేయాలని, అదే పిన్ నంబర్ ఆ విద్యార్థి 12వ తరగతి వరకు కొనసాగుతుందని తెలిపారు. ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్ల జారీలో అంతర జిల్లా, ఇతర రాష్ట్రాలకు వెళ్లె విద్యార్థులకు మండల విద్యాధికారి సంతకం అవసరం మేర తన కార్యాలయానికి వచ్చి యాజమాన్యాలు సంతకం తీసుకోవచ్చని ఆయన చెప్పారు. ప్రభుత్వ సెలవు దినాలు తప్పకుండా టించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి పాఠశాలకు విద్యాశాఖ అధికారిగా తన పరిధిలోని సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాలల నిర్వాహకులు కూడా సహకరించాలని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి శ్రావన్ కుమార్, కోశాధికారి ఎన్.ఆర్.రజినీకాంత్, స్పోర్ట్స్ కార్యదర్శి బోయ లక్ష్మణ్, గండిపేట్ మండల అధ్యక్షుడు ఆనంద్, ప్రధానకార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి ప్రకాష్ సింగ్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ. యాదగిరి, ప్రతినిధులు భాస్కర్, శోభారాణి, నాగసీత, వాజీద్, రాజేంద్రనగర్ ప్రసాద్, సందీప్, మదుసూధన్, నరేందర్, ఐలయ్య, వెంకటేశ్ చారి, కరుణాకర్, సలీమ్, ఎతేశ్యామ్ముద్దీన్, భీమయ్య, మనోహర్, జగనాథమ్, వెంకటేశ్వర్లు, రఫీ, రాములు, హర్ష, ముస్తాక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవం లో పాల్గొని మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

# నేల ఆరోగ్యం-వరి పరిశోధన సంస్థలో వన మహోత్సవం

బుద్వేల్, ఆగస్టు12(ప్రభాత ఉదయం): పచ్చదనం పెంపొందించే ఉద్దేశంతో రాజేంద్ర నగర్‌లోని వరి పరిశోధన సంస్థ , నేల ఆరోగ్యం యాజమాన్య సంస్థల ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బోధనేతల సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం మంచిదన్నారు. వాతావరణ మార్పులను అధిగమించాలంటే మొక్కలు పెద్ద సంఖ్యలో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, డాక్టర్ ఎన్ ఆర్ జి వర్మ , డాక్టర్ కృష్ణ , డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ పవన్ చంద్రా రెడ్డి , డాక్టర్ సుక్పాల్ కుమార్, డాక్టర్ కిరణ్ బాబు, నర్సింగరావు, ఎం. రాజు, యాదయ్య, రమేష్ , జహంగీర్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

# 8 నెలల్లోనే ఎందుకీ వ్యవసాయ విధ్వంసం?

## సాగు విస్తీర్ణం తగ్గడంపై కేటీఆర్ ఆందోళన



హైదరాబాద్, ఆగస్టు12(ప్రభాత ఉదయం): తెలంగాణలో ఈ ఏడాది 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గడంపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలోనే వ్యవసాయానికి ఎందుకింత గడ్డుకాలమని 'ఎక్స్'లో ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలన సాగుకు స్వర్ణయుగమైతే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సాగు విస్తీర్ణం ఒకసారిగా ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గటం ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలో దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో 8 నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



# ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం

## రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

తుక్కుగూడ, ఆగస్టు12(ప్రభాత ఉదయం) ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామనిరంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ తుక్కుగూడ లో సూరంగుట్ట ఆటో డ్రైవర్స్ యూనియన్( ఏఐటీయూసీ) ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కార్మిక జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే రామస్వామి, ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే చందు యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శిలు వనంపల్లి జైపాల్ రెడ్డి, దత్తు నాయక్ , ఆటో డ్రైవర్స్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరేందర్ , మండల నాయకులు యాదయ్య , ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటిన

# బీట్కూరి రిషిత, రోహన్




రాజేంద్రనగర్, ఆగస్ట్ 12(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్గూడా చెందిన బ్యాడ్మింటన్ లో ప్రతిభ చాటిన బీట్కూరి రిషిత, రోహన్ అండర్ 15 బ్యాట్మెంటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. బ్యాడ్మింటన్ లో ప్రతిభ చాటిన చిన్నారులకు సెవెన్ స్టార్ స్పోర్ట్స్ అకాడమీ ప్రతినిధి అనిల్ శర్మ షీల్డ్ లను అందజేశారు. ఈ పోటీలలో 150 చిన్నారులు పాల్గొన్నారు. అండర్ 11 కేటగిరి అండర్ 13,అండర్ 15, అండర్ 17, అండర్ 19 కేటగిరి స్ పాల్గొన్నారు. అండర్ 17 బాయ్స్ విన్నర్స్ శ్రీవర్ధన్,సంతోష్ రన్నర్స్. బీట్కూరి రోహన్ ఏ ఆంటోని అండర్ 15 విన్నర్, అండర్ 17 బాలికల పోటీలలో బీట్కూరి రిషిత ప్రతిభ చాటారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో

# గ్రంథ పాలకుల దినోత్సవం

బుద్వేల్, ఆగస్టు12(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లో. సోమవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎస్ ఆర్ రంగనాధన్ 132 వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి పుష్పాంజలి ఘటించారు. .యూనివర్శిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎన్ పి రవి కుమార్, రంగనాధన్ గ్రంధాలయ శాస్త్రంలో చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థులందరికీ గ్రంధాలయం యొక్క ఉపయోగం, దాని ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాదికారులు, కే ఎం సీ లో పనిచేస్తున్నా టెక్నికల్ స్టాఫ్, రీసెర్చ్ స్కాలర్స్, మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. రంగనాథన్ కు ఘన నివాళి అర్పించారు. డా. రంగనాథన్ గ్రంధాలయ సేవలకు గుర్తింపు తెచ్చారన్నారు. రంగనాథన్ గ్రంధాలయ సేవలకు చేసిన కృషిని పురస్కరించుకొని ఆయన జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం లైబ్రేరియన్ డే ని జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. .రంగనాధన్ గ్రంధాలయ సేవల గురించి యూనివర్సిటి విద్యార్దులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ టెక్నికల్ అసిస్టేట్ డి.వి.సత్యనారాయణ, సూపరిడెంట్ సుధాకర్,రాము, ఎ.అంజనేయులు తదితరులు విశేషంగా పాల్గోన్నారు.



డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

